క్లుప్తంగా

కర్ణాటక సంగీత ప్రాక్టికల్ పరీక్షలకు విశేష స్పందన



సంగీత ప్రాక్టికల్ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

బోట్‌క్లబ్: ప్రాచీన కళాకేంద్రం చండీఘర్ యూనివర్సిటీ శాస్త్రీయ నృత్య, కర్ణాటక సంగీత వార్షిక ప్రాక్టికల్ పరీక్షలు స్థానిక శ్రీప్రకాష్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 60 మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకూ ఈ పరీక్షలు నిర్వహించారు. కాకినాడ సెంటర్ హెడ్ నాట్యాచార్య బేతా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు హైదరాబాద్‌కు చెందిన నాట్యాచారిణి పారుపూడి అరుణాస్వరూప్, సంగీత విద్వాంసులు మధుసూదన్ ఎగ్జామినర్లుగా వ్యవహరించారు.

ఏడాదికి మూడువేల మందికి కళ్లజోళ్లు, వస్త్రాల పంపిణీ



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ

బాలాజీచెరువు: బాదం బాలకృష్ణ క్లాత్ అండ్ ఐ-గ్లాస్ ప్రాజెక్టు ద్వారా ఏడాదికి 3 వేల మందికి ఉచితంగా కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేస్తున్నామని బాదం బాలకృష్ణ క్లాత్ అండ్ ఐగ్లాస్ ప్రాజెక్టు చైర్మన్ బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక రామారావుపేట లయన్స్‌హాల్లో ఆదివారం 120 మందికి కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ హోమియోపతి క్లినిక్ ద్వారా ఉచితంగా హోమియోపతి మందులతో పాటు కాపు కళ్యాణ మండపం వద్ద మామిడిచెట్లకు ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. లయన్స్‌క్లబ్ సభ్యురాలు అనుపమ పుట్టినరోజు సందర్భంగా గ్రీన్‌ఫీల్డ్ అందుల పాఠశాలలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ సీమకుర్తి పాపారావు, కార్యదర్శి కె.కుమార్, కోశాధికారి నూకాజీ, దేవత పుత్రరావు, పేకేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఆలయ ముఖద్వారం ప్రారంభం

సామర్లకోట: స్థానిక అయోధ్య రామపురంలో ఉన్న సత్తెమ్మతల్లి ఆలయం వద్ద రూ.3.50 లక్షలతో నిర్మాణం చేసిన ముఖద్వారాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు ఆదివారం ప్రారంభించారు. శరన్నవరాత్ర ఉత్సవాల సమయంలో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులకు గురికావడంతో షెడ్‌తో పాటు ముఖద్వారం నిర్మాణం చేశారు. కార్యక్రమంలో సిద్ధాంతి చీమలకొండ ప్రసాద్, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మాజీ కౌన్సిలర్ బడుగు శ్రీకాంత్, సరోజ్ వాసు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

సామర్లకోట: ప్రతి ఏడాది రైల్వే ఉమ్మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు, కార్మికుల పిల్లలకు నిర్వహిస్తున్న వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో భాగంగా ఆదివారం స్థానిక రైల్వే కల్యాణ మండపంలో డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. 6 నుంచి 9 ఏళ్లు ఉన్న విద్యార్థులకు ఇష్టమైన జంతువు, 10 నుంచి 12 ఏళ్లు ఉన్న వారికి సూపర్ హీరో, 13 నుంచి 15 ఏళ్ల వయసు కలిగిన విద్యార్థులకు పండగ సంబరాలపై మూడు కేటగిరిలుగా విభజించి పోటీలు నిర్వహించిన్నట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు. ఈ డ్రాయింగ్ పోటీల్లో 62 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వారందరికి సర్టిఫికేట్లు, బహుమతులు అందజేశారు. రెండు ఆదివారాలు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న వారి పేపర్లను విజయవాడ రైల్వే డివిజన్ కార్యాలయానికి పంపిస్తారు. న్యాయ నిర్ణేత సమక్షంలో డివిజన్ వ్యాప్తంగా జరిగిన పేపర్లు పరిశీలించి ప్రతి రైల్వే స్టేషన్ నుంచి ఆయా కేటగిరిలల్లో ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అక్టోబరు 2న విజయవాడలో అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఈఎన్ శివప్రసాద్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ సాంబ శివరావు, రైల్వే సూపరింటెండెంట్ శ్రీనివాసు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు



గొంచాలలో పూజలు అందుకున్న కనకదురమ్మ

సామర్లకోట: మండలంలోని గొంచాలలో ఉన్న కనకదుర్గ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. గ్రామ ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో పండగ వాతావరణం ఏర్పడింది.

ఉద్యానవనం.. కళావిహీనం

- పాడైన క్రీడా పరికరాలు
- సందర్శకులకు తప్పని అవస్థలు
- కొరవడిన కనీస మరమ్మతులు



పార్కులో వాకింగ్ ర్యాంపు దుస్థితి



పార్కులో సందర్శకులు కూర్చునే బెంచీవద్ద తాగి పడేసిన ఖాళీ మద్యం సీసాలు

బోట్‌క్లబ్: నిత్యం బిజీగా ఉండే ప్రజలు కాసేపు సేద తీరదామని బోట్‌క్లబ్ పార్క్‌కు వస్తే అక్కడ సమస్యలు ప్రజలకు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. చిన్నారులు ఆడుకునే క్రీడా పరికరాలు పాడైపోయి నెలలు గడుస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పార్కులో పారిశుధ్యం మరీ అధ్వానంగా తయారయింది. పార్కులో ఎక్కడ చూసినా చెత్తాచెదారమే దర్శనమిస్తోంది. ఎప్పుడో వారం పది రోజులకు ఒకసారి పార్కు శుభ్రం చేసిన అక్కడ చెత్తను మాత్రం తరలించకుండా అక్కడే గుట్టలుగా వేసి తగలబెడుతున్నారు. దీంతో పార్కుకి వచ్చే సందర్శకులకు పొగ కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పార్కుకు ఉదయం, సాయంత్రం సుమారు పదివేల మంది పైగా సందర్శకులు వస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పార్క్ ఎంతో సుందరంగా ఉండేది. ప్రతిరోజూ పారిశుధ్య సిబ్బంది ఇక్కడ చెత్తను తరలించేవారు. పార్కు కూడా ఎంతో అందంగా ఉండేది. చిన్నారులు, పెద్దలు హాయిగా సేదతీరేందుకు వచ్చేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పార్కు అధ్వానంగా తయారయింది. పార్కులో పాడైన ఏ వస్తువైనా సరే మరమ్మతులు చేయకపోవడంతో సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పార్కులో సుమారు 20కి పైగా విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోయాయి. వాటికి కనీసం మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేశారు. పలు విద్యుత్ స్తంభాల వద్ద ఎంతో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు చేతికి అందేంత ఎత్తులో ఉన్నాయి. ఎవరైనా చిన్నారులు తెలియకుండా అక్కడికి వెళితే పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. కానీ కార్పొరేషన్ అధికారులు మాత్రం ఇవేమీ తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పార్కులో చెత్తాచెదారం పేరుకుపోవడంతో విషజంతువులకు ఆవాసాలుగా మారిపోయాయి. దీంతో తెల్లవారుజామున సాయంత్రం వేళలో పార్కు వాకింగ్ కోసం వచ్చే వాకర్స్ నిత్యం భయపడుతూనే వాకింగ్ చేయాల్సిన పరిస్థితి. పార్కులోకి కుక్కలు సైతం యథేచ్ఛగా వస్తున్నాయి. పార్కులో ఉన్న బెంచీలపై అవి నిద్రిస్తున్నాయి. వాకింగ్ వచ్చే మహిళలు కుక్కలు వాకింగ్ ట్రాక్‌పై తిరగడంతో భయపడుతున్నారు. కుక్కలు పార్కులోకి రాకుండా సెక్యూరిటీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు. పార్కులో ఉన్న బాత్‌రూమ్స్ కంపు కొడుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఎవరైనా అక్కడకు వెళితే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. కనీసం అక్కడ నీటి సదుపాయం కూడా లేకపోవడంతో వాకింగ్‌కు వచ్చే మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన రాకుండా ఎటువంటి చర్యలు కూడా తీసుకోవడం లేదు. పార్కులో పిఠాపురం రోడ్డు వైపు వాకింగ్ ర్యాంపు మొత్తం పాడైపోవడంతో నిత్యం వాకర్స్ దానిలో పడి గాయాల పాలవుతున్నారు. సుమారు ఆరునెలల క్రితం ఇది పాడయిన కార్పొరేషన్ అధికారులు పట్టడం లేదు. ఇటీవల పార్కులో వాకింగ్ ట్రాక్‌పై ఇసుక, మట్టి అసంపూర్తిగా వేసి వదిలేశారు. వాకింగ్ ట్రాక్‌పై ఇసుక కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ వేసి, మరొక ప్రాంతంలో చాలా తక్కువగా వేసి వదిలివేశారు. దీంతో వర్షం వస్తే వాకింగ్ ట్రాక్ కొన్ని చోట్ల బురదమయంగా తయారు కావడంతో వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు.

చీకటి పడితే మందుబాబులకు అడ్డాగా..

పార్కులో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోయి వాటికి మరమ్మతులు చేయకపోవడంతో చీకటి పడితే అక్కడ అంధకారం నెలకొంటుంది. దీంతో అక్కడ మందుబాబులు అడ్డాగా చేసుకున్నారు. పూటుగా మద్యం తాగి ఖాళీ మద్యం సీసాలను అక్కడే వదిలేస్తున్నారు. పలు మద్యం సీసాలు వాకింగ్ చేసే ప్రాంతంలో సైతం పగలగొట్టి వేస్తున్నారు. దీంతో వాకర్స్‌కు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పార్కులో సెక్యూరిటీ సిబ్బంది ఉన్న ఇవేమీ వారికి పట్టడం లేదు.

గాలికి వదిలేసిన సీసీ కెమెరాల నిర్వహణ

పార్కులో సీసీ కెమెరాలు ఉన్న ప్రస్తుతం ఆ పని చేయకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డంగా తయారైంది. కార్పొరేషన్ అధికారులు సీసీ కెమెరాలు కూడా మరమ్మతుల చేయడం లేదు. సీసీ కెమెరాలు పని చేస్తే రాత్రి సమయాల్లో మందుబాబులు వస్తే గుర్తించి వారిపై చర్యలు తీసుకొనేందుకు వీలుగా ఉండేది. ప్రస్తుతం సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవడంతో అక్కడ సెక్యూరిటీ సిబ్బంది ఏమీ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి.

దుర్వాసనతో అవస్థలు



సాయంత్రం వాకింగ్ వస్తుంటాను. పార్కు చాలా అధ్వానంగా ఉంది. చెత్తను తగలబెట్టడం వల్ల పొగ వాకింగ్ చేసేటప్పుడు కళ్లలోకి వస్తుంది. 10 రోజులకు ఒకసారి ఇలాగే తగలబెడుతున్నారు. చెత్త తగలబెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. బాత్‌రూమ్‌లు కూడా సక్రమంగా ఉండడం లేదు. దుర్వాసన వెదజల్లుతున్నాయి. వాటిని శుభ్రం చేయాలి

– సత్యనారాయణ, వాకర్

జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలి



పార్కులో రమణయ్యపేట వైపు ఉన్న జిమ్ పరికరాలు ఇటీవల తొలగించారు. దీంతో వాకర్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రెండువైపులా జిమ్ పరికరాలు ఉండడంతో ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. కార్పొరేషన్ అధికారులు తొలగించిన జిమ్ పరికరాలు వెంటనే ఏర్పాటు చేయాలి.

– కె.కిషన్, వాకర్

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. ప్రధానమంత్రి మోదీ సేవా సప్తాహంలో భాగంగా ఆదివారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జేఎన్టీయూకే వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎస్పీ కార్యాలయం మీదుగా భానుగుడి సెంటర్ వరకూ నిర్వహించారు. డ్రగ్స్ రహిత భారతదేశంగా చూడాలన్నది ప్రధాని మోదీ లక్ష్యమన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు తెలియజేసేందుకు ప్రతి కళాశాలలోనూ బీజేపీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులతో మేము డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యార్లగడ్డ రామ్‌కుమార్, పైడా కృష్ణమోహన్, గట్టి సత్యనారాయణ, పెద్దిరెడ్డి రవికిరణ్, మాల కొండయ్య, సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ రంగంపై శిక్షణ

సామర్లకోట: పట్టణంలోని సీబీఎం సెంటర్‌లో ఉన్న న్యాక్ శిక్షణా కేంద్రంలో నిరుద్యోగ యువతకు గృహ నిర్మాణ రంగంలో సర్వేయింగ్ కోర్సు, ప్లంబింగ్ కోర్సులపై ఈనెల 29 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని సెంటర్ కో-ఆర్డినేటర్ ఆర్ఎస్ఎస్ శివ తెలిపారు. ఈ కోర్సు 75 రోజుల శిక్షణ ఉంటుందని, ఐటీఐ, డిప్లొమో, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. ప్లబింగ్ కోర్సు 50 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, దీనికి 10, ఇంటర్ పూర్తి చేసి 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉన్నవారు అర్హులన్నారు. ఈ శిక్షణలో లైఫ్ స్కిల్స్, కంప్యూటర్ స్కిల్స్ నేర్పించనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, 4 ఫొటోలతో హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఈ సర్టిఫికెట్ల ఆధారంగా దేశ, విదేశాలలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. వివరాలకు 9440756250, 9666771726, లేదా 7386406664లకు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

మహాశక్తి యాగానికి శ్రీపీఠం ముస్తాబు

- దసరా వేడుకల్లో వంద కోట్ల కుంకుమార్చనలు
- రోజుకు 35 వేల నుంచి 40 వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా
- జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో పోలీసుల బందోబస్తు



కాకినాడ శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక అమ్మవారు



మహిళలు కుంకుమార్చన చేసేందుకు ఏర్పాటు చేసిన భారీ షెడ్

కాకినాడ రూరల్: లలితా సహస్ర నామార్చనలతో కాకినాడ శ్రీపీఠం ప్రాంగణం మార్మోగనుంది. దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని మహాశక్తి యాగం కొనసాగింపుగా మూడో సంవత్సరం వంద కోట్ల కుంకుమార్చనల సంకల్పంతో పరిపూర్ణానంద స్వామిజీ పెద్ద క్రతువుగా కార్యక్రమాన్ని చేపడుతున్నారు. దసరా నవరాత్రుల్లో భాగంగా సోమవారం నుంచి మహాశక్తి యాగం ప్రారంభమవుతోంది. ఉదయం 6.30 గంటలకు హోమాలు, 10 గంటల నుంచి 12 గంటల వరకు కుంకుమార్చనలు, అనంతరం మహాఅన్న ప్రసాదం వితరణ, సాయంత్రం ఐశ్వర్యాంబిక అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబరు 3 వరకు జరగనున్న వేడుకల్లో భాగంగా చివరి రోజున అమ్మవారు కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామిగా భక్తులకు దర్శనమిస్తారు. రోజుకు ఒక అమ్మవారికి హోమం నిర్వహించనున్నారు. సహస్ర చండీ హోమం, సహస్ర రుద్ర హోమం, బగళాముఖి హోమం, వారాహి హోమం, ప్రత్యంగిర హోమం, వటుక భైరవ హోమం నిర్వహించనున్నారు. తొలి రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, 2వ రోజు హరిద్రాదేవిగా, 3వ రోజు రాజమాతంగిగా, 4వ రోజు గాయత్రీదేవిగా, 5వ రోజు దుర్గాదేవిగా, 6వ రోజు రాజరాజేశ్వరి దేవిగా, 7వ రోజు వారాహిదేవిగా, 8వ రోజు సరస్వతి దేవిగా, 9వ రోజు బగళాముఖి దేవిగా, 10వ రోజు మహాలక్ష్మిదేవిగా భక్తులకు అమ్మవారు దర్శనమివ్వనున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు దీక్షా వస్త్రాలను ధరించి మహాశక్తి యాగంలో లలితా సహస్ర నామార్చనలు చేస్తూ కుంకుమార్చన చేసేందుకు రానుండడంతో వారికి ట్రాఫిక్ పరంగా ఏ విధంగా ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా ఎస్పీ బిందుమాధవ్ పర్యవేక్షణలో పోలీసులు అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

అరుణ సేవలు అభినందనీయం



స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన అరుణను సత్కరిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: ఉద్యోగ జీవితం లేదా సామాజిక సేవ కార్యక్రమాల్లో చేసిన సేవలో జీవితంలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కెనరా బ్యాంక్ ఏజీఎం గణేష్ పేర్కొన్నారు. స్థానిక భానుగుడి కెనరా బ్యాంక్‌లో ఆదిత్య అకాడమీ బ్రాంచ్ ఉద్యోగి పిక్కిలి అరుణ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ సందర్భంగా సత్కార సభ ఏర్పాటు చేశారు. ఏజీఎం గణేష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంతికభావంతో అందరి మన్ననలు పొంది బ్రాంచ్ అభివృద్ధికై కృషి చేసి ఎందరికో మార్గదర్శకంగా అరుణ నిలిచారన్నారు. ముఖ్యంగా జూనియర్ ఉద్యోగులకు మార్గదర్శకంగా ఉంటూ ఓ పక్క ఉద్యోగ బాధ్యతలతో పాటు బ్యాంక్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్‌గా ఉద్యోగుల హక్కులకై కృషి చేశారన్నారు. అలాగే యూనియన్ ద్వారా ప్రతి ఏడాది వృద్ధ, దివ్యాంగ, అనాథ ఆశ్రమాలకు సేవా కార్యక్రమాలు చేసి మన్ననలు పొందిన ఘనత ఆమెకు దక్కుతుందన్నారు. అనంతరం అరుణ, భర్త జేఎన్టీయూకే ఈఈఈ ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ గౌతమ్‌కుమార్, బ్యాంక్ ఉద్యోగులు, జేఎన్టీయూకే నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సగరుల ఆర్థికాభివృద్ధికి సహకరించాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సగరుల (ఉప్పర) ఆర్థిక అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కటారి త్రిమూర్తులు కోరారు. స్థానిక ఒక ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం గౌరవాధ్యక్షుడు కటారి రామకృష్ణ అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా సాదరబోయిన నరసరాజు, కటారి పరమేశ్వరరావు, అధ్యక్షుడిగా కటారి త్రిమూర్తులు, ఉపాధ్యక్షులుగా ములికి రాయుడు, ఏపూరి రాంబాబు, నక్కా మాధవ్‌కుమార్ ప్రధాన కార్యదర్శిగా జక్కి అప్పన్న, ఉప కార్యదర్శిగా కటారి వెంకట రాజారత్నం, ప్రధాన కోశాధికారిగా రాసనబోయిన సత్యనారాయణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యూత్ వింగ్ ప్రెసిడెంట్‌గా నక్క కృష్ణమూర్తి, సోషల్ మీడియా వింగ్ ప్రెసిడెంట్ కటారి శామ్యూల్, లీగల్ అడ్వైజర్‌గా గుర్రాల చిరంజీవికుమార్, ఆర్గనైజ్ కార్యదర్శిగా ద్రోణాద్రి అబ్రహం, సభ్యులుగా నక్క సద్గుణరావు, మొగలి రమేష్, గాది వీరబాబు, తంగెళ్ల సత్తిబాబు, కటారి కృష్ణమూర్తి తదితరులు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కటారి త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రంలోని సగరుల ఆర్థిక పరిస్థితి చాలా ఆందోళన కరంగా ఉందన్నారు. అందువల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ సంక్షేమ శాఖ ద్వారా ప్రత్యేక నిధులను సగరు(ఉప్పర)లకు కేటాయించి అమలు చేయాలన్నారు. వలస కార్మికులుగా జీవిస్తున్న సగరుల పిల్లల విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక హాస్టలను ఏర్పాటు చేయాలన్నారు. బీసీ-డీ లో ఉన్న సగరులను బీసీ-ఏ లో చేర్చాలన్నారు.

శరన్నవరాత్రులకు ఆలయాలు సిద్ధం


- ఆకట్టుకొనేలా భారీ ఏర్పాట్లు
- వివిధ అలంకరణల్లో దర్శనమివ్వనున్న అమ్మవారు



పెద్దశివాలయంలో శరన్నవరాత్రులకు చేస్తున్న ఏర్పాట్లు

బోట్‌క్లబ్: ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకూ కాకినాడ నగరంలో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు నిబంధనలకు అనుగుణంగా దర్శనాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులను ఆకట్టుకొనే విధంగా ఆలయం ముఖద్వారం వద్ద భారీగా సెట్టింగులు ఏర్పాటు చేశారు. అమ్మవారు ప్రతి రోజు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయంలో ప్రతిరోజు భక్తులను ఆకట్టుకొనే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు దాతల సహకారంతో ప్రసాదం పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో 22న విల్లంబులు, 23న ఊయల, 24న పుస్తకపాణి, 25న వీణాపాణి, 26న మహాలక్ష్మి, 27 జపమాల, 28న సింహారోహణం, 29న రక్తబీజాక్షుని వధ, 30న శుంభ, నిశుంభల వధ, అక్టోబర్ 1న మహిషాసురమర్దిని, అక్టోబర్ 2 బంగారం చీరలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్థానిక మాధవనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం చేసుకొనే విధంగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి ఎస్‌వీ సాయిబాబా తెలిపారు. స్థానిక దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి దేవస్థానం, ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకూ శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. స్థానిక భానుగుడి అయ్యప్పస్వామి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ పర్సన్ ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ తెలిపారు. వీటితో పాటు నగరంలో పలు అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం



శరన్నవరాత్ర ఉత్సవాలకు సాధారణ భక్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉచిత దర్శనంతో పాటు, ఇతర దర్శనాలు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్యూ ఏర్పాట్లు చేశాం. భక్తులకు క్యూలో మంచినీరు, మజ్జిగ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకొంటున్నాం.

– వడ్డి ఫణీంద్రకుమార్, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి



రంపయర్రంపాలెంలో నిరసన తెలుపుతున్న రైతుకూలీ సంఘం నాయకులు

గోకవరం: గ్రామంలో దళిత మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో బాధితురాలికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చేయనున్న రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు రంపయర్రంపాలెంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికపై అత్యాచారం జరిగి పది రోజులు గడచినా కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కనీసం స్పందించకపోవడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ఒక దళిత హోం మినిస్టర్ ఉన్న రాష్ట్రంలో దళిత మహిళలకు, అమ్మాయిలకు రక్షణ లేకుండాపోయిందని, మంత్రిగా స్పందించి అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని ఆర్థికంగా అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరుతూ సోమవారం రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మునలయ్య, రమణ, వీర పండు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో నారాయణస్వామి ఆలయం

సామర్లకోట: స్థానిక అతిపూరాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణస్వామి ఆలయం అంధకారంలో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారని, అయితే కరెంటు పోయిన సమయంలో ఇన్వెర్టర్ పని చేయకపోవడంతో భక్తులు చీకటిలోనే స్వామిని దర్శించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయంపై దృష్టి సారిస్తున్న అధికారులు భక్తుల సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారనే విమర్శలున్నాయి. ఆలయం అతిపూరాతనమైనది కావడంతో రాతితో నిర్మాణం చేయడంతో పాటు చిన్న చిన్న ద్వారాలు ఉండటంతో ఆలయంలోకి వెలుతురు వచ్చే అవకాశం లేదు. ఇప్పటికైనా అధికారులు ఇన్వెర్టరుకు మరమ్మతులు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

బాల్య వివాహాలు అరికట్టడంలో 'గురజాడ' పాత్ర కీలకం



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దాపురం: కన్యాశుల్కం తీసుకొచ్చి బాల్య వివాహాలను అరికట్టడంలో గురజాడ వెంకట అప్పారావు పోషించిన పాత్ర చెరగవేయని ముద్ర అని సాహితీ స్రవంతి అధ్యక్షుడు జ్యోష్యుల కష్ణబాబు అన్నారు. గురజాడ జయంతి సభ ఆదివారం ప్రజా నాట్యమండలి, పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఘనంగా నిర్వహించారు. గురజాడ అందించిన దేశభక్తిని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని పలువురు పేర్కొన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజేష్‌కుమార్ దేవత, గూనూరి రమణ, పీఎన్ఎం నాయకులు ఆర్.వీర్రాజు, మహపాతిన రాంబాబు, డి.సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

చిత్రలేఖన పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో బి.లతికా, వి.భార్గవి, సీనియర్స్ విభాగంలో టి.హేమంత్, సూపర్ సీనియర్స్ విభాగంలో అనిత ప్రథమ బహుమతి సాధించగా.. ఎం.ప్రణీత, సాయవీరచారి, ఎం.హాసిని, అమృతప్రియ, కె.ప్రశాంతి ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. కె.రేణుక, కెఎస్ అహ్మదభీ, సాహిదా, రేష్మ, డి.నేహాలు తృతీయ బహుమతులు సాధించారు.